క్లుప్తంగా

సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం


సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

కాకినాడ రూరల్: ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించి రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలోని దండుపుంత పేదలకు పొజిషన్ సర్టిఫికెట్ల(పట్టాలు)ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇటీవల పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తమ అభిమానాన్ని చాటుతూ.. దండుపుంతలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. నివాసం ఉన్న చోటే పట్టాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లింగం రవి, గగారిన్, నాని, గిరీష్, నల్లా రాణి, రేఖారెడ్డి, మేడిశెట్టి లక్ష్మి, మాచవరపు సత్యనారాయణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కాకినాడ: ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన, సత్వర పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహించారు. ఫోన్ ద్వారా 11, స్పందనలో 10 ఫిర్యాదులందాయి. టిడ్కో, శానిటేషన్, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడున్న అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే స్పందన, డయల్ యువర్ కమిషనర్‌తో కాకుండా, మిగిలిన రోజుల్లో కూడా టోల్ ఫ్రీ నంబరు 18004255990 నంబరుకు కాల్ చేయవచ్చని ప్రజలకు సూచించారు. రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఫోన్ ద్వారా సమస్యలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డా.పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

కరప: సంక్రాంతి పేరుతో ఎవరైనా గుండాట, కోడిపందాల నిర్వహణ, కోడిపుంజులకు కత్తికట్టడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని ఉప్పలంక, గురజనాపల్లి, గొర్రిపూడి, వేళంగి, వేములవాడ తదితర గ్రామాల్లోని పాత నేరస్తులు 38 మందిపై కరప ఎస్సై టి.రామకృష్ణ బైండోవర్ చేసి, సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా రామ్మోహన్

కాకినాడ: కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వల్లూరి రామ్మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన నియామకాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తనను గుర్తించి, పదవిలో నియమించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు.

సర్పవరం సీఐగా శ్రీనివాస్

కాకినాడ రూరల్: కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ సీఐగా వైఆర్‌కే శ్రీనివాస్ నియమితులయ్యారు. గతంలో పిఠాపురం సీఐగా పనిచేసిన ఆయన, ఆ తర్వాత ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్నారు. తాజాగా ఏలూరు రేంజ్ ఐజీ ఇచ్చిన బదిలీ ఉత్తర్వుల్లో భాగంగా ఆయన సర్పవరం స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన ఆకుల మురళీకృష్ణ విజయవాడలోని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు.

10న డయల్ యువర్ డీఎం

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 25534 నంబరుకు తెలియజేయవచ్చన్నారు.

పారిశుధ్య కార్మికుల బైక్ ర్యాలీ

కాకినాడ: సమస్యల పరిష్కారం కోసం పారిశుధ్య కార్మికులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆందోళనలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ, స్వతంత్ర సంఘాల పర్యవేక్షణలో ఆందోళన కొనసాగించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య సేవల కోసం ప్రైవేట్ కార్మికులను వినియోగిస్తే అడ్డుకుంటామన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పండగ రద్దీకి చెక్..!

- ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- వ్యాపార కార్యకలాపాలు, ప్రజావసరాలకు ఆటంకం లేకుండా ప్రణాళిక
- పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


కోన్‌లు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ క్రైం: ఏదైనా పండగ వచ్చిందంటే ఇంటిల్లిపాదీ సందడి. సరదాగా చేసే షాపింగ్ కుటుంబ సభ్యుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ సంతోషాన్ని అప్పటికే మార్కెట్‌లో నెలకొన్న భారీ రద్దీ ఆవిరి చేసేస్తుంది. అడుగు తీసి.. వేయలేని రద్దీలో కార్లే కాదు కనీసం ద్విచక్ర వాహనం కదలాలన్నా ఓ సవాలే. ఈ పరిస్థితి నుంచి ప్రజల రోజువారీ కార్యకలాపాలు మెరుగుపరిచి, పండగ సందడిని సంపూర్ణం చేసేందుకు కాకినాడ నగర ట్రాఫిక్ విభాగం నడుం బిగించింది. ప్రత్యేక చర్యలతో పండగ రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టింది.

పార్కింగ్ సమస్యకు కోన్‌ల పరిష్కారం

నగర ట్రాఫిక్‌కు అతి పెద్ద అంతరాయం ట్రాఫిక్. నిత్యం కిటకిటలాడే కాకినాడ మెయిన్ రోడ్‌లో ఈ సమస్య మరీ ఎక్కువ. భారీ వ్యాపార సముదాయాలున్న ఎన్నో వ్యాపార కేంద్రాలు గత ప్రభుత్వాల హయాంలో కనీస నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేయడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. మెయిన్ రోడ్డు వైశాల్యం దృష్ట్యా అక్కడి వ్యాపార సముదాయాలకు సెల్లార్ పార్కింగ్‌ను తప్పనిసరి చేశారు. గత నాలుగేళ్లలో కొత్తగా ఏర్పడ్డ ప్రతి షోరూం లేదా ఇతర వ్యాపార కేంద్రాలకు సెల్లార్ పార్కింగ్ ఉంటేనే అనుమతులిచ్చారు. సెల్లార్ పార్కింగ్ లేని షోరూంల బయట నిలుపుతున్న వాహనాలతో ఎదురవుతున్న సమస్య అంతా ఇంతా కాదు. దీని నియంత్రణ కోసం ఎస్పీ సతీష్‌కుమార్ సూచనలతో ప్రత్యేక పార్కింగ్ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా కోన్‌లు ఏర్పాటు చేసి, సెల్లార్ పార్కింగ్ లేని దుకాణాల వద్ద పార్కింగ్ స్పేస్ కేటాయిస్తున్నారు. తగిన బాధ్యత తీసుకోవాలని దుకాణాల యజమానులకు సూచిస్తున్నారు. అలా కేవలం కాకినాడ ట్రాఫిక్-1 పరిధిలోనే 40 కోన్లు ఏర్పాటు చేశారు.

60 బీట్ల ఏర్పాటు

పండగ రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ బీట్ల సంఖ్యను 40 నుంచి 60కి పెంచారు. ట్రాఫిక్-1 విభాగాన్ని సీఐ నూనె రమేష్ పర్యవేక్షిస్తుండగా, ఈ పరిధిలో 32 బీట్లు ఉన్నాయి. ట్రాఫిక్-2 పరిధిని సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. ఈయన పరిధిలో 28 బీట్లు ఏర్పాటు చేశారు. 60 బీట్లను 60 మంది ఏఎస్సైలు నిర్వహిస్తుండగా, కింది స్థాయి సిబ్బంది బీట్ల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ట్రాఫిక్ క్రమబద్ధంగా కొనసాగడానికి ఆటో ప్రయాణాలది కీలకపాత్ర. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలు అనుసరిస్తే, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సునాయాసం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్టు సీఐ చైతన్యకృష్ణ తెలిపారు.


కాకినాడ జ్యోతుల మార్కెట్‌లో పండగ రద్దీ

విద్యార్థులు, యువతకు అవగాహన

పండగ వేళ హద్దుల్లేకుండా చెలరేగేవారిలో యువతది కీలక పాత్ర. విద్యార్థి దశ నుంచి భారీ సీసీ బైకులతో రయ్‌మంటూ దూసుకెళ్లడం పరిపాటి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులు, యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కళాశాలలను సందర్శిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, కూడళ్లతో పాటు జనావాసాల్లో భారీ చప్పుళ్లు చేస్తూ వాహనాలు నడపడం శిక్షార్హమని హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేక బృందాలు

నిత్యం జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటుచేశారు. ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తూ, సేవల్లో పాలు పంచుకోవడం వీరి విధి. రోడ్లు దాటేందుకు సహకారం, ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలను కదిపేందుకు చోదకుడికి సాయం అందించడం, పిల్లల్ని తల్లిదండ్రులు రద్దీలో జాగ్రత్తగా చూసుకునేలా సహకరించడం, వీధి వ్యాపారుల వల్ల ట్రాఫిక్‌స్తంభించకుండా చర్యలు తీసుకోవడం వీరి విధుల్లో భాగం.

అతిక్రమిస్తే చర్యలు


నూనె రమేష్, సీఐ, ట్రాఫిక్-1


డీఎస్ చైతన్యకృష్ణ, సీఐ, ట్రాఫిక్-2 పీఎస్

పండగ వేళ రోజువారీ ప్రజా జీవితానికి ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకున్నాం. ఎస్పీ సతీష్‌కుమార్ నేరుగా కాకినాడ ట్రాఫిక్ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు పలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా అదనపు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి ప్రజా జీవితానికి ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. బైక్‌లతో మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ సమస్య పరిష్కారానికి దుకాణాల ముందు కోన్ల ద్వారా వాహనాలు నిలిపే ప్రాంతాలు కేటాయించడం సత్ఫలితాలిస్తోంది. అతిక్రమించి పార్కింగ్ చేస్తే వాహనాలను స్టేషన్లకు తరలిస్తున్నాం.

నిస్వార్థ ప్రజా సేవకుడు ఫ్రూటీకుమార్

- కాకినాడ ఎంపీ వంగా గీత
- ఘనంగా రాగిరెడ్డి కళాక్షేత్ర ప్రారంభం


రాగిరెడ్డి కళాక్షేత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు

కాకినాడ: ప్రతిఫలాన్ని ఆశించని నిస్వార్థ ప్రజా సేవకుడు రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ (ఫ్రూటీ కుమార్) భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన చేసిన సేవల రూపంలో ఇప్పటికీ ప్రజల మధ్య జీవించే ఉన్నారని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. దివంగత రాగిరెడ్డి జయరామ్‌కుమార్ పేరిట రూ.20 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో ఏర్పాటు చేసిన రాగిరెడ్డి కళాక్షేత్రను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఆదివారం రాత్రి ప్రారంభించారు. తొలుత రాగిరెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో తెలియజెప్పేలా కుమార్ పార్టీ కోసం పనిచేసిన తీరే నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ స్నేహానికి నిర్వచనంగా నిలిచే రాగిరెడ్డి కుమార్‌తో తనకెంతో అనుబంధం ఉందని, ఆయన లేనిలోటు పూడ్చలేనిదన్నారు. ఆయన పేరు చిరస్థాయిగా ఉండాలనే కళాక్షేత్రకు ఈ పేరు పెట్టామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ కాకినాడలో రూ.20 కోట్లతో రూపుదిద్దుకున్న కళాక్షేత్రకు కౌన్సిల్ ఆమోదంతో ఈ పేరు పెట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవకు అంకితమైన కుమార్ వంటి వ్యక్తులు, ప్రజల మధ్య లేకపోవడం తీరని లోటన్నారు. రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలో ఎక్కువ మంది ఆత్మీయులను సంపాదించుకుని కుమార్ అందరి మన్ననలు అందుకున్నారన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ తన పనితీరు ద్వారా ప్రజాభిమానాన్ని పొందిన కుమార్ రాజకీయాల్లో ఎంతోమందికి స్ఫూర్తి అన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయంలో రాగిరెడ్డి కుమార్ పడిన శ్రమ ఎనలేనిదన్నారు. చివరిగా రాగిరెడ్డి కుమార్ సతీమణి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా తన భర్త ఎంతో ప్రజాభిమానాన్ని చూరగొనడం సంతృప్తి ఉందంటూ కంటతడి పెట్టారు. కైట్ విద్యాసంస్థల అధినేత పోతుల విశ్వం, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిషోర్, రోకళ్ల సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు ఎస్‌వీఎస్ రావు, కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వరరావు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సాయం

బోట్‌క్లబ్: హోప్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర ఆధ్వర్యంలో ఐదు నిరుపేద కుటుంబాలకు సోమవారం నిత్యావసరాలు, పౌష్టికాహారం అందించారు. పిఠాపురం పరిసర గ్రామాలకు చెందిన వీరిలో కొందరు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో, వారి విజ్ఞప్తి మేరకు, సంస్థ నిర్వాహకులు స్పందించి సాయమందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర మాట్లాడుతూ రెయిన్‌బో చిల్డ్రన్ హోంను ఏర్పాటుచేసి, 25 మంది నిరుపేద చిన్నారులకు అన్ని వసతులు కల్పించామని వివరించారు. ఎవరూ ఆకలితో ఇబ్బంది పడరాదనే ఉద్దేశంతో షేర్ ఏ మీల్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైద్యం, మొక్కలు నాటడం, పేద విద్యార్థులకు ఫీజులు వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు వనుము శ్రీనివాస్, సుభద్ర, హేమలత, కుమార్, వైఆర్‌జీ కేర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడాలి : జేడీ శీలం

కాకినాడ: ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కష్టించి పనిచేయాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కళావెంకట్రావు భవనంలో సోమవారం గిరిజన, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు జంగా గౌతమ్, కొరివి వినయ్‌కుమార్, శ్రీపతి శ్రీపాదరావు, డాక్టర్ పాండురంగారావు, ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మండల పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం


కరపలో ప్రమాణం చేస్తున్న మండల పాస్టర్ల ఫెలోషిప్ కొత్త కార్యవర్గం

కరప: గ్రామంలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌లో సోమవారం జరిగిన పాస్టర్ల సమావేశంలో మండల పాస్టర్ల ఫెలోషిప్ 2024–25 కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కాకినాడ జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ జాయింట్ సెక్రటరీ రెవరెండ్ ఐ.జాన్‌సూర్యప్రకాష్ అందరి ఆమోదంతో కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. మండల పాస్టర్ల ఫెలోషిప్ నూతన ప్రెసిడెంట్‌గా రెవ పి.సత్యప్రసాద్‌బాబు, సెక్రటరీగా డాక్టర్ పి.సామ్యూల్ రాజు, ట్రెజరర్‌గా డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, కన్వీనర్‌గా డాక్టర్ జె.పాల్‌ప్రసాద్, చైర్మన్‌గా డాక్టర్ స్టీఫెన్‌బాబు, చీఫ్ అడ్వైజర్‌గా రెవ పీవీ ఇమ్మాన్యుయేల్, లీగల్ అడ్వైజర్‌గా డాక్టర్ డి.గోల్డ్‌స్టోన్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ డి.ఏసురత్నం, జాయింట్ సెక్రటరీగా రెవ ఎస్.భరత్‌కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా కె.శేఖర్‌మోజెస్, సభ్యులుగా కె.పాల్‌జాషువా, ఎం.సామ్యూల్‌రాజు, బి.మోజెస్, పి.అహరోను, పి.లక్ష్మణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యకలాపాలకు సహకరిస్తున్న లయన్ పంపన విజయరాజును సత్కరించారు.

ఘనంగా శాంతి కల్యాణం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయంలో రెండు రోజులుగా విశేష పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం, లక్ష తులసి పూజ చేశారు. రాత్రి శాంతి కల్యాణం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు, సభ్యులు ఆకుల రాజబాబు, మేడిబోయిన వేణు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సోమవారం సాయంత్రం ప్రతిపాదనలో ఉన్న ఎన్నికల స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక జేఎన్‌టీయూకే క్యాంపస్‌లో ప్రతిపాదించిన ఆయా కేంద్రాలను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అక్కడ ఉన్న సదుపాయాలు, కల్పించాల్సిన ఏర్పాట్లను చర్చించారు. ఆయన వెంట ఏఈఆర్వో బీవీ మురళీకృష్ణ ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ రూరల్: వాకలపూడి సెక్షన్ 11 కేవీ ఇండస్ట్రియల్-1 పరిధిలో వార్షిక మరమ్మతుల కోసం బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. వాకలపూడి పరిధిలోని ఇండస్ట్రియల్ ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్రాంతి సంబరాలతో సందడి

సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



పోటీలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, ఇతర నేతలు

కాకినాడ: జగనన్న సంక్రాంతి సంబరాలతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్‌కు అనూహ్య స్పందన కనిపిస్తోందన్నారు. కాకినాడలో వివిధ ప్రాంతాల్లో ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చక్కని వాతావరణంలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకొనే పండగ శోభ ఇక్కడ మరింత సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. దాదాపు రూ.30 లక్షల విలువైన బహుమతులను డివిజన్ల వారీగా అందిస్తున్నామన్నారు. ఈ నెల 30న స్థానిక ఆనంద భారతి గ్రౌండ్స్‌లో జరిగే ఫైనల్స్‌లో విజేతలకు ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ వంటి విలువైన బహుమతులు అందిస్తున్నామన్నారు. ఒకటో క్లస్టర్‌లో జరిగిన పోటీలను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రెండో క్లస్టర్‌లో పార్టీ నేత రాగిరెడ్డి సుబ్బారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మూడో క్లస్టర్‌లో ద్వారంపూడి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నాలుగో క్లస్టర్‌లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ రామాలయం వద్ద కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు జరిగాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన రంగవల్లుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ పద్మావతి, వెంకటదుర్గావతి వ్యవహరించారు. ఉత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు


కరపలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

కరప: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఈ నెల 10న ప్రారంభమవుతాయని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. నిర్దేశిత ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో ఈ ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పీడీలు, పీఈటీలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆటలు ఏ పాఠశాలల్లో నిర్వహించాలి, అందుకు చేయాల్సిన ఏర్పాట్లను వివరించారు. కరప, పెద్దపురప్పాడు, వేళంగి, గురజనాపల్లి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్ల గ్రౌండ్లలో 10వ తేదీ నుంచి మొదలై 20కల్లా పూర్తి చేయాలన్నారు. శని, ఆది, సోమవారాల్లో సంక్రాంతి సెలవులుంటాయని, మిగిలిన రోజుల్లో మండల స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్వహించే పోటీలకు డ్రా తీసి, తుది జాబితా ప్రకటించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, పీడీలు కె.శ్రీనివాస్, డీవీఎస్ లక్ష్మీకుమారి, బి.చంద్రశేఖర్, కె.నాగలింగేశ్వరరావు, వై.సువర్చలాదేవి, సీహెచ్ కృష్ణ, కె.రాజా రమేష్‌బాబు, వి.చాందినీశిరీష, పీఈటీలు ఎల్.జాన్, కె.రేణుక తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సిరులు

వలసపాకలలో 'వై ఏపీ నీడ్స్ జగన్'


వలసపాకల సచివాలయం-2లో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఇంట సిరులు కురిపించారని కాకినాడ రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ అన్నారు. వలసపాకల సచివాలయం-2 పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ రామకృష్ణ, నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ సచివాలయం-2 పరిధిలో డీబీటీ-నాన్‌డీబీటీ ద్వారా రూ.10.5 కోట్లు పంపిణీ చేశారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పెద్దఎత్తున రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణంరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అనుతూరి ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి నాయుడు, లక్ష్మణ్ యాదవ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమ్మె విరమించి.. విధులకు రండి

కార్మికులకు కమిషనర్ సూచన


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున తక్షణమే సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని నగరపాలకసంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. సోమవారం సాయంత్రం ఆయన కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్పొరేషన్‌అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం చర్చలు జరిపిన నేపథ్యంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చినందున కార్మికులు విధులకు రావాలన్నారు. అనంతరం ప్రత్యేక అధికారుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సమ్మె కొనసాగుతున్నందున కార్మికులు విధుల్లోకి వచ్చేవరకూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెత్తను రోడ్లపైన, డ్రైనేజీల్లో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టండి

పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. సోమవారం ఆయన 1, 2, 3 డివిజన్ల పరిధిలోని ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్, తోట సుబ్బారావునగర్, బీసీ కాలనీ, శంతనపురి కాలనీ, రమణయ్యపేట కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలు సహకరించినపుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమన్నారు.

విద్యే ప్రగతికి మూలం

విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్ పంపిణీ


కరప హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

కరప: కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా, సమాజంలో పేరుప్రఖ్యాతులు రావాలన్నా విద్యే కారణమని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశం జరిగింది. జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందరికీ విద్య అందించాలన్న సంకల్పంతో నాడు-నేడు పథకంతో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన, డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేశారన్నారు. అమ్మ ఒడి, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్ పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. తాజాగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.30 వేల విలువైన బైజూస్ ట్యాబ్‌ను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు మద్దతు తెలపాలన్నారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్ఎం యు.లీలామనోహర్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, వీరబాబు, కె.బాబీ పాల్గొన్నారు.

తూరంగి పాఠశాలలో..

కాకినాడ సిటీ: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తూరంగి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బలగం ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం తూరంగి జెడ్పీ హైస్కూల్‌లో 151 మంది విద్యార్థులకు హెచ్ఎం కడలి విజయదుర్గతో కలిసి ప్రభుత్వం అందజేసిన ట్యాబులు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులకు బోధించే పాఠాలకు అదనంగా సంబంధిత సమాచారాన్ని విద్యార్థులు పొందడానికి ట్యాబులు ఉపయోగపడతాయని హెచ్ఎం విజయదుర్గ అన్నారు. పగడాలపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబులు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దు సత్యనారాయణ, గొల్లపల్లి బాబులు, మండవ సమాధానం, నరాల నాగేశ్వరరావు, జగడం శ్రీహరి, ఆతం వీరభద్రరావు, విద్యాకమిటీ సభ్యులు సిద్ధాంతపు రాజు, నులుకుర్తి శ్రీనివాస్, అమరావతి పాల్గొన్నారు.

కొవ్వాడ స్కూల్‌లో..

కాకినాడ రూరల్: కొవ్వాడ జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. గ్రామ సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, సర్పంచ్ కోటిపల్లి ఉమా, ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సాధనాల రాజు, జాన్ ప్రభాకర్ వీటిని పంపిణీ చేశారు.